# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత వ్యవసాయ పరిశోధన సంస్థ రూపొందించిన 109 రకాల వంగడాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ విడుదల చేశారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో రబీ ధాన్యం విక్రయించిన రైతులకు బకాయిలను పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు విడుదల చేస్తారు.**
3. **రహదారి ప్రమాదాల నివారణ చర్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **తెలంగాణలో భద్రాద్రి సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.**
5. **అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

దేశంలో రైతులకు సాధికారత కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోది పేర్కొన్నారు. ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థ రూపొందించిన 109 రకాల వంగడాలను ప్రధానమంత్రి నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు, శాస్త్రవేత్తలతో ప్రధానమంత్రి సంభాషించారు. అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే జీవశక్తితో కూడిన 109 రకాల వంగడాలను విడుదల చేశామని చెప్పారు. వ్యవసాయ రంగంలో మెరుగైన ఆధునిక పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నూతన వంగడాల వలన వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయని, పర్యావరణానికి హితంగా కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కొత్త పంట రకాలను అభివృద్ధి చేసినందుకు శాస్త్రవేత్తలను నరేంద్రమోదీ ప్రశంసించారు. నిరుపయోగంగా ఉన్న పంటలను ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయన చేసిన సూచనలకు అనుగుణంగా పని చేస్తున్నామని శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గత రబీలో ధాన్యం విక్రయించిన రైతులకు 674.47 కోట్ల రూపాయల బకాయిలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు విడుదల చేస్తారు. ఇప్పటికే గత నెలలో 49 వేల 350 మందికి వెయ్యి కోట్ల రూపాయలను విడుదల చేసింది. మిగిలిన 35 వేల 374 మందికి 67 వేల 447 కోట్ల రూపాయల బకాయిలను తాజాగా విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిందని, ఏలూరులో

నిర్వహించే కార్యక్రమంలో మంత్రి  పాల్గొని రైతులకు చెక్కులు పంపిణీ చేయనున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

రహదారి  ప్రమాదాల నివారణకు అవగాహన కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో రోడ్ సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన రహదారి భద్రతా గోడపత్రికలను నిన్న ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.  రహదారి ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టులు, రేడియం స్టిక్కర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, హెల్మెట్ ధరించడంతో పాటు నిబంధనలు పాటించాలి అని మంత్రి కోరారు.

---------------------------

స్వాతంత్ర్యోద్యమ యోధులకు నివాళిగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు, దగ్గుబాటి పురందేశ్వరి  పిలుపునిచ్చారు. నిన్న ఆమె మాట్లాడుతూ, ముందు తరాల వారు స్వాతంత్రోద్యమంలో పాల్గొని ఎన్నో త్యాగాలు చేసి దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించారన్నారు. భావితరాల్లో జాతీయవాదం పెంపొందించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు  తెలుపుతూ,

వాయిస్ ( 37  సెకన్లు )

---------------------------

తెలంగాణలో భద్రాద్రి సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని  ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి  తెలిపారు. నిన్న సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్-2 పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,  పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం పంప్ హౌస్ ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 15న 2 లక్షల రూపాయల రుణమాఫీని చేస్తామని అన్నారు. పంప్ హౌస్‌ల పరిధిలో సాగు నీటి కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఏటా 6 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వనున్నామని చెప్పారు. 2026 ఆగస్టు 15 నాటికి ఆయకట్టులోని ప్రతి ఎకరానికి నీరందిస్తామని తెలిపారు.

---------------------------

అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ఐక్యరాజ్య సమితి తీర్మానం మేరకు 1999 నుండి ప్రతిఏటా ఆగస్టు 12వ తేదీన ప్రపంచ యువజన దినోత్సవాన్ని సభ్య దేశాలు నిర్వహిస్తున్నాయి. యువతకు ఉన్నత అవకాశాలు కల్పించి సవాళ్ళను, సమస్యలను అధిగమించే రీతిలో వారిని సన్నద్ధులను చేసేందుకు వీలుగా పలు కార్యక్రమాలు నిర్వహించడం, ఈ యువజన దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యం, “స్థిరమైన అభివృద్ధి దిశగా యువత కోసం డిజిటల్ నైపుణ్యాలు” అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

తెలంగాణలో అమెజాన్ సంస్థ డేటా కేంద్ర విస్తరణకు పెట్టుబడులు పెట్టనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అమెరికాలో పర్యటిస్తున్న మంత్రి అమెజాన్ కంపెనీ ప్రతినిధి బృందంతో సమావేశమై తెలంగాణలో డేటా సెంటర్ కార్యకలాపాలపై చర్చలు జరిపారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున తగినంత సహకారంతోపాటు ఉత్తమమైన ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో భారీ విస్తరణకు కంపెనీ ముందుకు వస్తుందని, హైదరాబాద్‌లో తమ క్లౌడ్ సదుపాయాలను మరింత విస్తరించే అవకాశాలపై సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు.

-------------------------

తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి తెలంగాణ ప్రజా ప్రతినిధులు భక్తులకు ఇచ్చే సిఫార్సు లేఖలతో తిరుమలలో వసతి, స్వామి వారి దర్శనానికి అనుమతిం చాలని తెలంగాణ శాసనసభపతి జి. ప్రసాద్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చంద్రబాబును కోరారు. నిన్న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈ మేరకు లేఖ అందజేశారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

-------------------------

తుంగభద్ర జలాశయంలో గేటు కొట్టుకుపోయిన ప్రదేశాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా రాయదుర్గం శాసన సభ్యులు కాలువ శ్రీనివాసులు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, కొప్పల, గదగ్ జిల్లాలతోపాటు, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలకు తుంగభద్ర జలాశయం వరప్రదాయనిగా ఉందన్నారు. గేటు కొట్టుకుపోవడంపై తుంగభద్ర ప్రాజెక్టు అధికారులు విచారణ చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే స్పందించాయని గేట్ల మరమ్మతుకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు.. అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో 4-4 అడుగుల గేట్లు ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు.

-------------------------

పారిస్ ఒలింపిక్స్ 2024 క్రీడల పోటీలు విజయవంతంగా ముగిసాయి. ఈ పోటీల్లో అమెరికా 40 స్వర్ణాలు, 44 రజితాలు, 42 కాంస్య పథకాలతో మొదటి స్థానంలో నిలిచింది. చైనా రెండవ స్థానంలో, ఆస్ట్రేలియా 3వ స్థానంలో నిలిచాయి. భారత క్రీడాకారులు ఈ ఒలింపిక్స్‌లో ఒక రజితం, 5 కాంస్యలతో మొత్తం 6 పతకాలను సాధించారు. ఈ ముగింపు వేడుకల్లో భారత బృందానికి్రా= శ్రీజేష్, మనూ బాకర్లు నాయకత్వం వహించారు. విశ్వక్రీడలకు ఆతిథ్యమిచ్చిన పారిస్ నుంచి 2028లో మూడో సారి ఆతిథ్యం ఇవ్వనున్న అమెరికాలోని లాస్ఏంజెలెస్ ఒలింపిక్ పతాకాన్ని అందుకుంది.

-------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నూతన నేర, న్యాయ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. ప్రతి ఒక్కరికీ సమర్ధవంతమైన న్యాయ వ్యవస్థను అందుబాటులో తీసుకువచ్చే లక్ష్యంతో ఈ చట్టాలను కేంద్రం రూపొందించింది. దేశ న్యాయ వ్యవస్థను మరింత పరిపుష్టం చేయడంతో పాటు భారత దేశ సార్వభౌమత్వం,

ఐక్యత, సమగ్రతకు ఈ మూడు చట్టాలు దోహదపడ తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ నూతన నేరచట్టాల ఆవశ్యకత గురించి తెలియజేస్తూ ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన నూతన నేర చట్టాలపై ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. నాందేడ్ నుంచి శ్రీకాకుళం రోడ్ వరకు రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈనెల 14న నాందేడ్–శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైలు నాందేడ్‌లో బయల్దేరి శ్రీకాకుళం రోడ్‌కు చేరుకోనుంది. అలాగే ఈ ప్రత్యేక రైలు బాసర, నిజామాబాద్, కామారెడ్డి, సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, సింహాచలం నార్త్, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయని పేర్కొంది.

======================